

సెలవు దినాల్లోనూ పన్నులు చెల్లించవచ్చు

కడప కార్పొరేషన్: ఈనెల 30, 31 తేదీల్లో ఉగాది, రంజాన్ పండుగల సందర్భంగా సెల వు దినాలు అయినప్పటికీ ఇంటి పన్ను, కొళా యి పన్ను, ఖాళీ జాగాల పన్నులు చెల్లించేందుకు అవకాశం కల్పించినట్లు నగరపాలక కమిషనర్ మనోజ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పన్ను చెల్లించేందుకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పా టు చేశామన్నారు. కడప నగరపాలక సంస్థ కార్యాలయంలో ఉదయం 6 నుండి రాత్రి 9 గంటల వరకు పన్నులు చెల్లించవచ్చని, నగరంలోని అన్ని వార్డు సచివాలయా ల్లో ఉదయం 8 నుండి సాయంత్రం 7 వరకు పన్ను చెల్లించవచ్చన్నారు.

ఐక్యతతో పండుగలు జరుపుకుందాం

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: కులమతాలకు అతీతంగా అందరం ఐక్యతతో ఉగాది, రంజాన్ పండుగలను సంతోషంగా జరుపుకోవాలని లౌకిక ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవి శంకర్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం నగరంలోని రామకృష్ణ నగర్ లో ఆప్ కి ఆవాజ్ ఆధ్వర్యంలో పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా కొంత మంది దాతలు జకాత్, ఫిత్ర డబ్బులతో ఆప్ కి ఆవాజ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో 145 పేద, మధ్య తరగతి కుటుంబాలకు రేషన్ కిట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆప్ కి ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మక్బూల్, జిల్లా కార్యదర్శి సయ్యద్ చాన్ బాషా, కెనరా బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ సుజిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘన సన్మానం



సేవామూర్తులను సత్కరిస్తున్న అతిథులు

కడప కోటిరెడ్డిసర్కిల్/కడప అర్బన్ : ఏపీఎస్ ఆర్టీసీలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న గుండ్లకొండ రవి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుండడంపై ఘనంగా సన్మానించారు. ఉగాది పండుగను పురస్కరించుకుని శనివారం హ్యాండ్స్ ఫోర్ యూ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు పట్టుపోగుల సుబ్బారావు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిమ వర్షిణి ఫౌండేషన్ – కాశీ విశ్వనాథ సేవా సమితి ద్వారా గుండ్లకొండ రవి అందిస్తున్న సామాజిక సేవలు ప్రశంసనీయమన్నారు. ఒకవైపు కానిస్టేబుల్‌గా ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తూ, మరోవైపు వీలు దొరికినపుడల్లా అనాథ మృతదేహాలకు అంత్యక్రియలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నందుకు ఈ అవార్డుతో సత్కరిస్తున్నామన్నారు. ఇంకా పలువురు స్వచ్ఛంద సేవకులను సన్మానించారు. కార్యక్రమంలో చిన్నచౌకు ఎస్ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి, పాలకొండ్రాయస్వామి దేవస్థానం చైర్మన్ రెడ్డెయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో బుడగజంగాలకు ఎస్సీ సర్టిఫికెట్లు

కడప కోటిరెడ్డిసర్కిల్ : అట్టడుగున ఉంటూ విద్య, సంక్షేమానికి దూరమై కుల ధృవీకరణపత్రాలు లేక ఇబ్బందులు పడుతున్న బుడగ జంగాల సామాజిక వర్గానికి త్వరలో ఎస్సీ సర్టిఫికెట్లు ఇచ్చేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే మాధవీ రెడ్డి తెలిపారు. శనివారం కడప నగరంలోని బేడ, బుడగజంగం కాలనీకి చెందిన నాయకులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బేడ బుడగ జంగాల ప్రతినిధులు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణలో తమ కులాన్ని క్యాబినెట్‌లో ఆమోదించి కేంద్రానికి పంపారని, ఈ విషయంగా ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు దూపం రాజు, ఉపాధ్యక్షులు శ్రీరాములు, రాష్ట్ర ఉపాధ్యక్షులు కొండయ్య, సంఘం నాయకులు పాల్గొన్నారు.

మూల్యాంకన కేంద్రంలో వసతులు కల్పించాలి

కడప ఎడ్యుకేషన్: కడపలోని మున్సిపల్ హైస్కూల్ మెయిన్‌లో ఏప్రిల్ 3వ తేదీ నుంచి ప్రారంభమయ్యే మూల్యాంకనానికి అన్ని వసతులు కల్పించాలని ఏపీటీఎఫ్–1938 జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజు, రాళ్లపల్లి అబ్దుల్లా కోరారు. ఈ విషయమై శనివారం జిల్లా విద్యాశాఖ అధికారి షేక్ షంషుద్దీన్‌ను కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు.

రంజాన్ తోఫా పంపిణీ



రంజాన్ తోఫా పంపిణీ చేస్తున్న మేయర్ సురేష్ బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్: రంజాన్ పండుగను పురస్కరించుకొని కడప నగరంలోని 23 వ డివిజన్ కార్పొరేటర్ తుంగ విజయలక్ష్మి, డివిజన్ ఇంచార్జ్ ఐస్‌క్రీం రవి ఆధ్వర్యంలో 500 మంది ముస్లిం, మైనార్టీలకు రంజాన్ తోఫా పంపిణీ చేశారు. శనివారం స్థానిక ఆహార్ భవన్ వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమానికి మేయర్ కె. సురేష్ బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి నరేన్ రామాంజులరెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరై నిత్యావసర సరుకులు, కూరగాయలను పేదలకు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మహిళా అధ్యక్షురాలు టీపీ వెంకట సుబ్బమ్మ, పార్టీ నాయకులు షఫీ, సుబ్బరాయుడు, రెడ్డి ప్రసాద్, సింధు పాల్గొన్నారు.

పిల్లలకు చట్టాలపై అవగాహన కల్పించాలి



ఆలంఖాన్‌పల్లి జెడ్పీ హైస్కూల్లో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి హేమస్రవంతి

కడప ఎడ్యుకేషన్: పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించాలని పలువురు జడ్జిలు పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఆలంఖాన్‌పల్లి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో సీనియర్ సివిల్ జడ్జి హేమ స్రవంతి, మున్సిపల్ హైస్కూల్ మెయిన్‌లో మొబైల్ కోర్టు జడ్జి కుమారి ఆశప్రియ, గవర్నమెంట్ బాలికల హైస్కూల్లో అడిషినల్ సీనియర్ సివిల్ జడ్జి ఆసిఫా సుల్తానాలు పోక్సో చట్టం, లైంగిక వేధింపులు, జాతీయ బాలల హక్కుల రక్షణ కమిషన్, అధికారిక పోర్టల్ పోక్సో ఈ బాక్స్ బటన్ , చైల్డ్ లైన్ హెల్ప్‌లైన్ నెంబర్ 1098, లీగల్ సర్వీసెస్ హెల్ప్‌లైన్ నెంబర్ 15100 అంశాల గురించి తెలియచేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ–2 ఇర్షాద్ అహ్మద్ పాల్గొన్నారు.

నగరంలో ఘనంగా ఇఫ్తార్

కడప కల్చరల్ : కడప నగరం అల్మాస్ పేటలో ఉన్న జామియా తుస్సాలిహాత్ మదరసాలో శనివారం ఇఫ్తార్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కడప ఇస్లామిక్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ ముక్తార్ అహ్మద్ అతిథిగా హాజరై మాట్లాడారు. కడప ఇస్లామిక్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

పార్టీ ఇచ్చిన బాధ్యతలను సక్రమంగా నెరవేర్చాలి

– వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి



రవీంద్రనాథ్‌రెడ్డిని సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం రాష్ట్ర కమిటీ సభ్యులు

కడప కార్పొరేషన్: పార్టీ ఇచ్చిన బాధ్యతలను ప్రతి ఒక్కరూ సక్రమంగా నెరవేర్చాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి, కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి నరేన్ రామాంజులరెడ్డి సూచించారు. శనివారం వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం రాష్ట్ర కమిటీ ప్రధాన కార్యదర్శులుగా నియమితులైన ఉప్పలపాటి యోబు, కె.శరత్ బాబు, రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన సి. త్యాగ రాజు వారిని కలిసి శాలువా కప్పి, పూలమాల వేసి ఘనంగా సన్మానించారు. తమకు పదవులు రావడానికి సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా రవీంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ ఈ పదవులను బాధ్యతగా భావించి కష్టపడి పనిచేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ బోర్డు మాజీ ఛైర్మెన్ పులి సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

– అంతకుముందు వారు కడప నగరపాలక సంస్థ కార్యాలయంలో మేయర్ సురేష్ బాబును కలిసి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం రాష్ట్ర కార్యదర్శులు సి. త్యాగరాజు, మాతంగి సుబ్బరాయుడు, నగర అధ్యక్షుడు కంచుపాటి బాబు పాల్గొన్నారు.

శిల్పారామంలో ఉగాది, రంజాన్, నవమి కార్యక్రమాలు

కడప కల్చరల్ : కడప శిల్పారామంలో ఉగాది, రంజాన్, శ్రీరామ నవమిలను పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పాలనాధికారి ఎస్. కృష్ణప్రసాద్ తెలిపారు. శనివారం నగరంలోని స్టేట్‌గెస్ట్ హౌస్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. శిల్పారామంలో ఉగాది సందర్భంగా ఆదివారం సాయంత్రం 5.30 గంటలకు ప్రముఖ వేద పండితులు చక్రవర్తుల నాగాంజనేయశర్మచే పంచాంగ పఠనం ఉంటుందని, సాయిరాం ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. 31 రంజాన్ పండుగను పురస్కరించుకుని ప్రముఖ టీవీ కళాకారులచే ప్రత్యేక నృత్యప్రదర్శనలు నిర్వహింపజేస్తామన్నారు. ఏప్రిల్ 6న శ్రీరామనవమి సందర్భంగా శిల్పారామం సంప్రదాయ వేదికపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో శిల్పారామం ఫీల్డ్ సూపర్‌వైజర్ మధుసూదన్ బాబు, సీనియర్ అసిస్టెంట్ రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి కె. ప్రత్యూష కుమారి

కడప ఎడ్యుకేషన్: అమ్మాయిలు, మహిళల పట్ల లైగింక వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని సీనియర్ సివిల్ జడ్జి కె. ప్రత్యూష కుమారి పేర్కొన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో కడపలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కే ఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో పోక్సో చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి మాట్లాడుతూ పోక్సో చట్టం అంటే లైంగిక నేరాల నుండి పిల్లల రక్షణ చట్టం 2012 అన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే జిల్లా న్యాయసేవాధికార సంస్థ కడప దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వి. సలీం బాషా, ఒకటవ టౌన్ అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ శ్రీనివాసులు, అధ్యాపకులు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: రేషన్ కార్డు దారుల ఈ–కేవైసీ అప్‌డేట్ గడువును మరింత కాలం పొడిగించాలని డీసీసీ అధ్యక్షురాలు విజయజ్యోతి పేర్కొన్నారు. శనివారం నగరంలోని ఇందిరాభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగుల స్థాయిలో సేవలు అందిస్తున్న ఆశా వర్కర్లకు న్యాయమైన వేతనం, ఇతర హక్కులు అందించాలని కోరుతున్నామన్నారు. ప్రజలపై ఆర్థిక భారం పెంచే స్మార్ట్ మీటర్ల వ్యవస్థాపనను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

తైక్వాండో ఆత్మరక్షణకు ఆయుధం



శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులతో వీసీ, ప్రిన్సిపాల్, రిజిస్ట్రార్

కడప ఎడ్యుకేషన్: జ్ఞానంతో పాటు శారీరక, మానసిక వికాసంతో ఆత్మ స్థైర్యం గల యువత తయారవుతారని యోగి వేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు అన్నారు. యోగివేమన విశ్వవిద్యాలయ వసతి గృహాల విద్యార్థినిలకు క్యాంపస్‌లో రెండవ విడత తైక్వాండో వారం రోజుల శిక్షణ తరగతుల ముగింపు సమావేశం శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆచార్య అల్లం శ్రీనివాస రావు మాట్లాడారు. క్యాంపస్ కళాశాల ప్రధానాచార్యులు, హాస్టళ్ల చీఫ్ వార్డన్ ప్రొ.ఎస్.రఘునాథ రెడ్డి, కుల సచివులు ప్రొఫెసర్ పుత్తా.పద్మ, వైయస్సార్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జయరామి రెడ్డి , తైక్వాండో శిక్షణ నిపుణులు నాగూర్ బాబు, వ్యాయామ విద్య క్రీడల శాస్త్ర శాఖ సహ ఆచార్యులు డాక్టర్ కె. రామసుబ్బారెడ్డి మాట్లాడారు.

రిమ్స్ లో అన్నదానం

కడప అర్బన్: ఏటూరి లక్షుమమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. శనివారం కడప నగర శివారులోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్) లో 600 మంది పేదలకు అన్నదానం చేశారు. కడపలోని15వ డివిజన్ చెర్లోపల్లి గ్రామంలోని ఏటూరి లక్షుమమ్మ 4వ వర్ధంతి సందర్భంగా ఏటూరి కుటుంబ సభ్యులు ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏటూరి నరసింహారెడ్డి, ఏటూరి పాల్ రెడ్డి, ఏటూరి చంద్రా రెడ్డి, ఏటూరి పెంచల్ రెడ్డి పాల్గొన్నారు.

భూకంప మృతులకు నివాళి

కడప కల్చరల్ : థాయిలాండ్, మయన్మార్, బ్యాంకాక్ దేశాలలో శుక్రవారం భారీ భూకంపంలో మరణించిన వారి ఆత్మలకు శాంతి కలగాలని శాంతి సేవా సొసైటీ వ్యవస్థాపకులు మడగలం ప్రసాద్, రిటైర్డ్ ప్రిన్సిపాల్ ఏలూరి ప్రభుదాస్ ఆకాంక్షించారు. శనివారం కడప మహావీర్ సర్కిల్‌లో సొసైటీ సభ్యులతో కలిసి కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు.

రోడ్డు భద్రతపై అవగాహన



రోడ్డు భద్రతపై అవాగాహన కల్పిస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది

కడప అర్బన్: రోడ్డు భద్రతపై వాహనదారులు, ప్రజలు, విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని పోలీసు అధికారులు సూచించారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణే లక్ష్యంగా జిల్లాలో రోడ్డు భద్రత పై శనివారం జిల్లా వ్యాప్తంగా పోలీస్ స్టేషన్ల పరిధిలోని విద్యార్థినీ, విద్యార్థులకు, యువతకు, ఆటో, టాక్సీ, లారీ డ్రైవర్లకు, ద్విచక్ర వాహన దారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

రోబోటిక్ కీళ్ల మార్పిడిలో విశేష ఖ్యాతి



మాట్లాడుతున్న డాక్టర్ విద్యాసాగర్‌రెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్: కడప నగరంలోని విద్యాసాగర్ హాస్పిటల్ రోబోటిక్ కీళ్ల మార్పిడిలో నూతన విధానాలను పాటించి అంతర్జాతీయ ఖ్యాతి గడించిందని హాస్పిటల్ ఎండీ డాక్టర్ విద్యాసాగర్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ జేబీజేఎస్ (జోర్నల్ ఆఫ్ బోన్‌అండ్ జాయింట్ సర్జరీ) ఆర్టికల్ సిబ్బంది తమ ఆస్పత్రి నిర్వహించిన అరుదైన చికిత్సా విధానాన్ని గుర్తించి ప్రచురించారని పేర్కొన్నారు. తమ ఆస్పత్రి 18 సంవత్సరాలుగా కడప, ఇతర జిల్లాల ప్రజలకు ఎముకలు, కీళ్ల వ్యాధుల్లో సేవలు అందిస్తోందన్నారు. కీళ్ల మార్పిడి రంగంలో దేశ, విదేశాలలో సైతం తమకు అనుభవం ఉందని తెలిపారు. తాను మోకాలి అరుగుదల సమస్యకు సరికొత్త విధానంలో తక్కువ ఖర్చుతో విజయవంతంగా కీళ్ల మార్పిడి చికిత్సలు నిర్వహించామన్నారు. 7000కు పైగా కీళ్ల మార్పిడి చేసిన అనుభవంతో ఈ సర్జరీ ఆర్టికల్ కేస్ రిపోర్టులో ప్రపంచ వ్యాప్తంగా ప్రచురించడం హర్షణీయమన్నారు. తమకు అన్ని విధాలుగా సహకరిస్తున్న డాక్టర్ శ్రీలక్ష్మి, ఇతర సిబ్బందికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.